# పథకాలకు ఆకర్షితులై..

సోన్ : కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



**నిర్మల్ జిల్లా** సోన్ మండలంలోని సిద్ధులకుంట, న్యూవెల్మల్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాదాపు 100 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఆదివారం సాయంత్రం అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గులాబీ కండు వాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేసీఆర్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.

**- సోన్, అక్టోబర్ 22**



ఇటీవల నిర్మించిన సీసీరోడ్డు



దేవాదాయ శాఖ నిధులతో నిర్మిస్తున్న ఆలయం

# సిర్గాపూర్ ప్రగతిలో సూపర్..

- మారిన గ్రామం రూపు రేఖలు
- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
- రూ. 90 లక్షలతో సీసీ రోడ్లు
- మోడల్ పంచాయతీ భవన నిర్మాణం
- ఆదర్శ పంచాయతీగా గుర్తింపు
- ఆనందంలో గ్రామస్తులు




సిర్గాపూర్ మోడల్ గ్రామ పంచాయతీ భవనం

దిలావర్‌పూర్, అక్టోబర్ 22 : గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్కారు క్రమం తప్పకుండా నిధులు విడుదల చేస్తున్నది. పెద్ద ఎత్తున అభివృద్ధి చేపడుతూ గ్రామాల రూపురేఖలను మారుస్తున్నది. ఇందులో భాగంగానే దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్ పంచాయతీ అభివృద్ధిలో దూసుకెళ్తున్నది. గ్రామంలో జనాభా 1512 ఉంది. గ్రామాభివృద్ధిపై సర్పంచ్ గంగారెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా ముందుగా పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్డు, క్రీడా మైదానం, హరితహారం నర్సరీ, ఇంటింటికీ ఇంకుడు గుంత, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించారు. పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

**అద్భుతంగా అంగన్‌వాడీ భవనం..**

గ్రామ పంచాయతీ నిధుల ద్వారా మోడల్ అంగన్‌వాడీ భవనాన్ని తీర్చిదిద్దారు. పాఠశాల భవనాన్ని పంచాయతీ నిధుల ద్వారా కార్పొరేట్ పాఠశాలగా తీర్చిదిద్దారు. విద్యార్థులకు కావాల్సిన ఆట వస్తువులను గ్రామ పంచాయతీ నుంచి కొనుగోలు చేశారు. ఇటీవల కేసీఆర్ కిట్ పేరుతో గ్రామానికి ఆట వస్తువులను ప్రభుత్వం అందించింది. రూ.10.50 లక్షలతో వైకుంఠధామం నిర్వహించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా వైకుంఠధామం చుట్టు మొక్కలు నాటారు.

**మోడల్ పంచాయతీ భవనం..**

ఉపాధి హామీ పథకం నిధులతో అన్ని వార్డుల్లో రూ. 90 లక్షలతో సీసీ రోడ్లు వేయించారు. నిర్మల్ నియోజకవర్గంలోనే మోడల్ గ్రామ పంచాయతీ భవనం నిర్మించారు. దీని నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 25 లక్షలను మంజూరు చేసింది. దీనిని ఈమ మధ్యే ప్రారంభించారు. ఇటీవల ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డును మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ నుంచి సర్పంచ్ గంగారెడ్డి అందుకున్నారు.



నూతనంగా నిర్మించిన పశువైద్యశాల

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



బీఆర్ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు

దిలావర్‌పూర్, అక్టోబర్ 22 : బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ మండల కన్వీనర్ కొమ్ముల చిన్న దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం న్యూ లోలం గ్రామంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి రంజిత్‌రెడ్డితో కలిసి గ్రామంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన వారు 30 మందికి పైగా యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. నిర్మల్ రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ తమ్మళ్ల ముత్యం, నాయకులు ఒడ్నం కృష్ణ, స్వామి గౌడ్, లడ్డు నరేశ్, రమణ,కాల్వ ఆలయ డైరెక్టర్ గూండ్ల నర్సయ్య, తమ్మళ్ల నర్సయ్య, భగవంతు, శ్రీనివాస్, మురళి, గంగయ్య, రషీద్, బొడ్డు గంగయ్య, సాయి, ముత్యం,బుచ్చన్న, అనిల్ గౌడ్, గోవిందుల మహేశ్ పాల్గొన్నారు.

# వైభవంగా దుర్గామాతకు బోనాలు



సోన్ : బోనాలను ఎత్తుకొని వస్తున్న మహిళలు

సోన్, అక్టోబర్ 22 : సోన్ మండల కేంద్రంలోని శ్రీ సాయి మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా బోనాలను సమర్పించారు. ఇంటింటికీ బోనాలను ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. అందర్ని చల్లంగా ఉంచాలని, పాడి పంటలు బాగా పండాలని మొక్కులను చెల్లించుకున్నారు.

**నిర్మల్‌లో..**

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 22 : జిల్లా కేంద్రంలో శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. నిర్మల్‌లోని శాంతినగర్, హౌజింగ్ బోర్డు కాలనీ, కురన్న పేట్, బంగల్‌పేట్, బాగులవాడ, ఆదర్శనగర్, ప్రియదర్శిని నగర్ కాలనీల్లో మండపాల్లో నెలకొల్పిన దుర్గామాతల వద్ద నిత్యం ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ప్రతి రోజు హారతి, అర్చన, కుంకుమార్చన పూజలు భక్తులు నిర్వహిస్తున్నారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు నిత్యం అన్నదానం చేస్తున్నారు.

# ఘనంగా కుమ్రంభీం జయంతి

సోన్, అక్టోబర్ 22 : సోన్ మండలంలోని సోన్, పాక్‌పట్ల, తదితర గ్రామాల్లో కుమ్రంభీం జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుమరంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ అంపోలి కృష్ణప్రసాద్ రెడ్డి, సోన్ బీఆర్ఎస్ మండల కన్వీనర్ మోహినొద్దీన్, సర్పంచ్ టీ వినోద్, ఎంపీటీసీ దాసరి లింగవ్వ శ్రీనివాస్, వార్డు సభ్యులు భీముడు, సాగర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం

తానూర్, అక్టోబర్ 22 : మండలంలోని బెల్‌తరోడ గ్రామ శివారులో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ లోకం సందీప్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్‌తరోడ గ్రామ శివారులో దాసరి శంకర్ పొలం పక్కన పాతనీళ్ల ఒర్రె వాగులో గుర్తు తెలియని మృతదేహం(వయస్సు సుమారు 45 సంవత్సరాలు) ఉందని గ్రామ పంచాయతీ కార్యదర్శి కల్యాణ్‌కర్ అశ్విని సమాచారం అందించారు. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మృతదేహానికి సంబంధించి సమాచారం తెలిస్తే 8712659542 ఫోన్‌కు సమాచారం అందించాలని కోరారు.